ఆ చేతి చేత ...

-ముళ్ళపూడి వెంకటరమణ

బామ్మ వంట చేస్తూ ఉండగానే, అక్కడ తారట్లాడి, ఆవిడ కన్ను మరగేసి వత్తుల పెట్లో డబ్బులు చెక్కేయ్యడంలో భీమశంకరంగారు చిన్నపుడు సిద్ధహస్తుడు. ఆ రోజుల్లో వెనకబడ్డ స్నేహితులకు ఈ విద్య కిటుకులు ఉపదేశించి గురువనిపించుకున్నాడు. బడి ఎగేసి కాలవగట్ల వెంట బీడీలు కాలుస్తూ రోజుల తరబడి తిరిగినా గోడ కట్టినట్టు అబద్ధాలు చెప్పి ఎవరికీ అందకుండా నిభాయించుకోగలిగిన సాటిలేని మేటి మొనగాడు. దరిమిలా పెద్దవాడయ్యాక, ఆఫీసుకు చెప్పిన జబ్బు చెప్పకుండా సెలవుపెట్టి నెగ్గుకొచ్చిన ధీశాలి. అమెరికన్ పుస్తకాల సలహాలతో ఇంకా ఎన్నో పరిస్థితులకు తట్టుకోవడం, సమస్యలను ఎదుర్కోడం, ఎదిర్చి నిలబడడం నిలచి పరిష్కరించడం నేర్చుకున్నాడు. చిన్నప్పుడు కంఠతా వచ్చిన పదమూడో ఎక్కంలాగే ఇదీ క్రమేపీ రూపు మాసింది. ఆ రోజులు వెళ్ళిపోయాయి.

అంతటి భీమశంకరంగారు ఏభయ్యో పడిలో పడ్డాక, ఒక ఆదివారంనాడు, ఎదుట గోళ్ళు గిల్లుకుంటూ కూర్చున్న పాతికేళ్ళ కుమార రత్నం వంక బాధగా చూస్తూ పడక కుర్చీలో పడుకుని సతమతమవు తున్నాడు.

''చలేస్తోందని చెప్పి చూడరా నాయనా'' అన్నాడు చివరికి.

''శాలువా కప్పుకోమందండి. లేపోతే సావిట్లోకొచ్చి పడుకోమంటోందండి'' అన్నాడు కుమారుడు విజయంగా.

''ఆమోదించకపోయింది ... అయినా కాక పోయినా ఏం మహిళలురా అబ్బాయి. ప్రాణాలు తోడేస్తున్నారనుకో. మొగుడు వెధవ ఆదివారం పూట కాస్త ఊళ్ళోకెళ్ళాలంటే వీళ్ళ నిఘా ఏమిట్రా'' అన్నాడు భీమశంకరం ప్రాణం విసుగెత్తిపోయి.

కొడుకు తలవంచుకున్నాడు మాట్లాడ కుండా.

''టైమెంతయిందిరా''

''మూడున్నరండి''

''అయ్య బాబోయ్ రైలుకింక గంటన్నర ఉందన్నమాట'' అన్నాడు భీమశంకరంగారు.

ఆయన ఆ ఉదయం 9 గంటల నుంచి మూడున్నరవరకూ పదిసార్లు టైమడిగి తొమ్మిదిసార్లు అయ్యబాబోయ్ అన్నాడు. ఒకసారి అబ్బా అపుడే రెండయిం దిరా అన్నాడు. క్రితం రాత్రి తొమ్మిది నుండి ఆ రోజు ఉదయం 7 గంటల వరకూ కొడుక్కి డబ్బివ్వమనీ, 7 నుండి 9 వరకూ తన పంచె, చొక్కా కండువా తన ముఖాన తగలెయ్యమనీ భార్యను పరిపరివిధాల బ్రతి మాలుతూ వచ్చాడు.

ఆరు మూడయేది మూడు ఆరయేది ''ఆ యాభై'' మాత్రం ఇచ్చేది లేదని ఆవిడ ఖర్రారుగా చెప్పేసింది. ''కట్నం లేకుండా పిల్లని చేసున్నాం కదా! ఆ మాత్రం అల్లుడు గదా అని ఓ నూట పదహార్లు పండుగ పేరు చెప్పి వాళ్ళివ్వరాదా మన వెధవాయ పెళ్ళాంచేత అడిగించ రాదా.'' అని ఆవిడ రాత్రి గట్టిగా అనేసింది.

మెల్లిగా వెధవా అంటే గట్టిగా ముండా అనే తరహా మనిషి భీమశంకరంగారి భార్య.

పండక్కి అత్తారింటికి వెళ్ళి మళ్ళా పట్నం వెళ్తూ కొడుకూ కోడలూ ఇక్కడ దిగారు. ఓ నెల జీతం ముందే తీసుకుని ప్రయాణాలకు ఖర్చు పెట్టేసినందువల్ల, పట్నంలో కొంప చేరగానే ఆవ గింజ దగ్గర్నుంచి తడుముకోవాలని బండి దిగిన గంటలో కొడుకు విన్నవించుకున్నాడు. ఉన్న డబ్బు రైలుకి కటాకటిగా సరిపోతుందని కూడా చెప్పుకున్నాడు. భీమశంకరం గారి గుండె కరిగిపోయింది. ఆయన భార్య ససేమిరా కానీ ఇవ్వడానికి వల్లకాదంది. ఆపాటి జాలి తనకీ ఉందని కూడా చెప్పింది. అవతల కొడుకో కోడలో విని ఏమనుకుంటారో అని భీమశంకరం గారి బెంగ.

''సరేలే. నువ్వు ఇవ్వద్దు పొద్దున నేనే చూసుకుంటా'' అన్నాడు చాలా గంభీరంగా.

ఆదివారం ఉదయం ఆయన లేచి అప్పుకు వెళ్ళబోయేసరికి చొక్కా పంచె, కండువా కనబడలేదు. పెట్టె తాళం వేసుంది.

''ఔనే, నా చొక్కా ఏదీ!'' అంటూ వంటింట్లోకి వెళ్ళాడు.

''ముందు స్నానం చెయ్యండి.'' అందామె.

శంకరంగారు స్నానం చేసి కట్టుకున్న పంచె తడిపేశాడు. ఓ అంగవస్త్రం, తువ్వాలు అందించిందావిడ. అవి కట్టుకుని, దేవుడికి దీపం వెలిగించి, ఓ పువ్వు ముక్క పడేసి లేచాడు. ఉట్టి వెనక చిలక కొయ్యకి తగిలించి ఉన్నాయి తన

ఆఫీసు దుస్తులు. కాస్త ఆశ్చర్యపడుతూ తీసుకోబోయే సరికి ''ఆగండి. ఆది వారం పూట ఎక్కడికెళ్తారు!''

అందామె.

''పనుంది.''

''నాకు తెలుసు ఆ రాచకార్యం. మీరేం వాడికి డబ్బు తెచ్చివ్వక్కర్లేదు. అంత అవసరమయితే ఇక్కడింకొక రోజు ఉండి, అత్తవారింటినించి తీగె టపా మీద తెప్పించుకోమనండి.''

''అది కాదే...''

''మీరు ముందు వీధరుగు మీద కెళ్ళి కూర్చుని పేపరు చదువుకోండి. నాకు పనుంది. పాలకాయలు, జంతికలూ చెయ్యాలి.''

శంకరంగారు నోరు మూసుకుని వీధరుగు మీదకెళ్ళిపోయాడు.

కొడుకు అక్కడ కూర్చుని ఆలోచిస్తున్నాడు.

''బాబూ ఇవ్వాల్టికాగి, రేపు వెళ్ళరాదురా. ఇవాళ ఆదివారం. రొఖం జత పడింది కాదు.'' అన్నాడు ఎంతో లాలనగా.

''లేదండీ నాన్నగారూ. రేపే జాయినయిపోవాలి.''

శంకరంగారు దిగాలుగా కూలబడ్డాడు కుర్చీలో. తను ఒక్కడుగు అలా వెళ్లొస్తే ఎవడి నెత్తో కొట్టి యాభై కాదు వందైనా పుట్టించవచ్చునని ఆశ ఉంది. కాని ఇంట్లో ఆడది మొండికెత్తి పోయి, తన చొక్కా పంచె వంటింట్లో పెట్టుకుని ఇవ్వను పొమ్మంటే ఎలా చావడం... తాలూకా ఆఫీసులో కాషియర్ గిరీ ఆమో దిస్తూ అంగోస్త్రం కట్టుకు ఊరేగడం అంటే ఒళ్ళు చచ్చిపోయినట్లుంది. అబ్బా యికే చీటి రాసిచ్చి పంపుదామంటే మనసొప్పలేదు. వాడిప్పటికే ఎంతో మదన పడి, డబ్బు వద్దులెండి నాన్నగారూ అంటున్నాడు.

కన్న కొడుకుకి కానీ డబ్బివ్వలేనివాడినా అనుకుని ఒక్కసారిగా తెగించి, వంటింట్లోకెళ్ళి ''నాకు పనుంది. ఆ గుడ్డలిలా పారెయ్'' అన్నాడు గంభీరంగా. ఆవిడ వల్లకాదు పొమ్మంది అంతకన్నా గంభీరంగా. ఆ తరవాత శంకరంగారికి చిన్నప్పటి విద్యలు జ్ఞాపకం వచ్చాయి. అక్కడే కాసేపు తారట్లాడి చూశాడు. లాభం లేకపోయింది. ఆవిడ వెయ్యి కళ్ళు పెట్టుకుని చూస్తూ ఉందాయె.

తన చిన్ననాటి కళా వైదగ్ధ్యం ఈనాడు ఎందుకూ కొరగాకుండా పోయిందని విచారించాడు శంకరంగారు. ఏడెనిమిదేళ్ళ కొడుకున్నా, కాస్త తరిఫీదు ఇచ్చి, ఇలాటి సమస్యలను చులాగ్గా ఎదుర్కోవచ్చు. ఉన్నవాడు పాతికేళ్ళవాడాయె. వాడికి ఇప్పుడు టోకరా విద్య ఎలా నేర్పడం

కాసేపు ఆలోచించి కొత్తరకం ఎత్తువేశాడు ఆయన. వీధరుగు మీద కూర్చుని కోడలు పిల్లని పిల్చాడు. ''అమ్మాయి! వంటింట చిలక్కొయ్యని నా చొక్కా పంచా ఉన్నాయి గాని, కాస్త పట్రా అమ్మా'' అన్నాడు.

కోడలు మళ్ళా రాలేదు. ఆవిడే వచ్చింది. ''మీక్కాదు చెప్పింది. ఏమిటా కుళ్ళు చేష్టలు'' అని కూకలేసి వెళ్ళిపోయింది. కోడలు విస్తుపోయింది. భోజనాలయ్యాయి. పదకొండయింది. పన్నెండయింది. ఒంటిగంట కూడా అయినా, ఆవిడగారు కునుకు తీసేటట్లు కనబడలేదు. మళ్లీ నిప్పంటించి, పిండి వంటలు ప్రారంభించింది- కొడుకూ కోడలూ సాయంత్రం వెళ్లిపోతున్నారు గదా అని.

శంకరంగారికి నిద్ర రాలేదు. కాలుకాలిన పిల్లిలా తిరుగుతున్నాడు. కొడుకు నిద్రపోతున్నాడు.

ఆయనకో ఊహ తోచింది. వాడి చొక్కా వేసుకుంటే... పంచె లేదాయె పొడుగు పంట్లాంలే ఉన్నాయి.

శంకరంగారికి సిగ్గేసింది. అయినా సరే అని ఓ పంట్లాం కొనుక్కున్నాడు. చొక్కాలన్నీ చిత్రంగా ఉన్నాయి. పట్నం చొక్కాలు కాబోలు ఒకటీ బొడ్డు దిగదు. రవికెల్లా ఉన్నాయి.

అద్దంలో చూసుకున్నాడు. నవ్వొచ్చింది. తను నవ్వేలోగానే ఇంకో రెండు గొంతులు, ఒకటి కిలకిల, ఇంకొకటి ఫెళఫెళ నవ్వాయి. ఆ నవ్వుకి లేచిన కొడుకు కూడా పకపక నవ్వాడు.

శంకరం గారికి ఒళ్ళు చచ్చిపోయినట్లయింది. దొంగతనం చేస్తూ పట్టుబడ్డట్టనిపించింది. బీరువా కింద చూశాడు దూరిపోదామని. కోడిగుడ్డు దీపం ఉండే గూట్లోకి చూశాడు. అందులో ముడుచుకు కూర్చుందామని... ఒక్క క్షణం ఆగి ముగ్గురివంకా చూశాడు. ఒక్క పెట్టున తనూ నవ్వెయ్యడం ప్రారంభించాడు.

నవ్వులయిపోయాక, తన పంచె, చొక్కా యియ్యమని అడిగాడు భార్యని.

మీకేం మతిపోయిందా అందామె.

మళ్ళా అంగవస్త్రం - తువ్వాలు కట్టుకుని, అరుగు మీద కుర్చీలో చేరాడు. శంకరం గారు - సృష్ట్యాది నుండి ఏ పురుషుడూ దేనికీ పడనంతగా విరహతాపం పడుతూ.

మూడున్నర అయింది. రైలుకింక గంటన్నర టైముంది. ఎలా డబ్బు పుట్టించడం.

వీధి వెంట ఓ కుర్రాడు వస్తున్నాడు అట్టపెట్టెని తన్నుకుంటూ. వాడు తెలుసు శంకరంగారికి. పెద్ద ఊహ పోయింది. కుర్రాణ్ణి పిలిచాడు. తెగించాడు. ''ఒరేయ్ బాబు నువ్వు సుబ్బారావు గారింటికెళ్ళి అర్జంటుగా... అహకాదు,

నిజలింగప్పకు అనారోగ్యం

తన చిత్రానికి పాట రాసి ఇవ్వమని అడిగిన చాలా రోజులకు ఆ నిర్మాత కృష్ణశాస్త్రి గారిని దర్శించి పాట మాట జ్ఞాపకం చేశాడు. దానికి జవాబుగా దేవులపల్లి వారు కాయితం మీద ''నిజలింగప్పకు అనారోగ్యం'' అని రాసి చూపారు. నిర్మాతకు ఏమీ బోధపడలేదు. ఎక్కడో వున్న నిజలింగప్పకు అనారోగ్యమైతే శాస్త్రిగారు పాట రాయకపోవడమేమిటో అసలే అర్థం కాలేదు. ఇక శాస్త్రిగారికి బదులు చెప్పడానికి, ఎదురు ప్రశ్న వేయడానికి సంకోచించిన నిర్మాత తర్వాత మళ్ళీ కలుద్దామని తిరిగి వచ్చేశాడు. మాటల సందర్భంలో ఆ నిర్మాత ఈ సంగతి శ్రీశ్రీతో అంటే ఆయన భాష్యం చెప్పారట! నిజలింగప్ప అంటే ఆత్మారాముడని, అనారోగ్యం శాస్త్రిగారికేనని. ఒక క్షణం ఆలోచించి 'ఓహో' అనుకున్నాడు నిర్మాత అర్థం చేసుకుని.



ఆరుద్ర హాస్యముద్ర

ఒకప్పుడు సిగరెట్టు ఆరుద్రగారికి ఆరో ప్రాణం. చాలా సంవత్సరాల క్రితం (ఒక పుష్కరం అయివుండవచ్చు) సిగరెట్‌కు స్వస్తి చెప్పారు. కారణం అడిగిన మిత్రు లకు ఆయన చెప్పిన జవాబు- ''అవి వర్జీనియా పొగాకుతో తయారవుతాయి. వర్జించ తగినవని అందులోనే వుంది కదా!''

మా ఆఫీసు జవాను నాగన్నింటికెళ్ళి ఇక్కడున్నట్లుగా చిటికెలో కేకేసుకురా, నీకు రేపు గాలిపడగ కొనిస్తా'' అన్నాడు.

ఏకళనున్నాడో వాడు సరేనని వెళ్ళాడు. మూడున్నర నుండి నాలుగు దాకా శంకరంగారి గుండెకాయ నిమిషానికి మూడు వందలసార్లు కొట్టుకుంది.

నాలుగింటికి నాగన్న వచ్చి ఏం బాబూ అనగానే స్థిమితపడింది.

''ఏవోయ్ నాగన్నా! నీకు పుణ్యం వస్తుంది. రేపు రూపాయొస్తుంది. కాని, వెంటనే సుబ్బారావు గారింటికెళ్ళి అర్జెంటుగా అమాంతంగా ఒక్క యాభై రూపాయలు అడిగి తెచ్చిపెట్టు. రేపు ఆఫీసుకు రాగానే ఇస్తానని చెప్పు'' అన్నాడు.

నాగన్న కళ్ళు పెద్దవి చేసి, ''అంత డబ్బు నాకిస్తారా. బాబయ్యా, తవరే ఒక్కడు గెల్లరాదూ!'' అన్నాడు.

''వెళ్దును కాని పంచె చొక్కా... దానికెంలే. నే చెప్పానని చెబుదూ ఇస్తాడు.''

''పోనీ సీటీ ముక్క రాసియ్యండి బాబు''

''చీటీ, చీటీ కదూ, మరే చీటీ... అవును చీటీ... కాని కాని వీల్లేదే మా యింట్లో... నాకర్జెంటు పనుంది. నువ్వెళ్ళి చెప్పు. కావాలంటే ఆయన్నే పట్రమ్మను'' అన్నాడు శంకరంగారు కంగారుగా. లోపలికి తొంగి చూశాడు. భార్య దగ్గర్లో లేదు.

పుణ్యం ఉంటుందనీ, జన్మలో మేలు మర్చిపోడనీ, డబ్బు మర్నాడే ఫిరాయించేస్తాడనీ, సంగతి తాపీగా చెప్తాడనీ, పుణ్యం ఉంటుందనీ, జన్మలో మేలు మర్చిపోలేడనీ పదే పదే మరీ మరీ సుబ్బారావుకు చెప్పి ఎలాగేనా రొఖం జతపరిచి పట్రావలసిందని నాగన్నకి చెప్పి పంపాడు.

నాగన్న వెళ్ళిన క్షణం నుండి నాలుగూ నలభై ఐదు వరకూ ఆయన గుండె నిమిషానికి నాలుగు వందల సార్లు చొప్పున కొట్టుకుంది.

ఇంట్లో పిండి వంటలు పూర్తి అయిపోయాయి. మూట కట్టేసి, కొడుకూ కోడలూ ప్రయాణానికి సిద్ధమైపోయారు. భార్య పట్టు చీర కట్టేసు కుంది. కొడుకు బండి తీసుకురావడానికెళ్ళాడు. ఇంకో పది నిమిషాలలో అంతా రైలుకి బయల్దేరుతారు.

నాగన్న సుబ్బారావు ఇంటికి వెళ్తాడా! వెళ్తే ఆయన ఉంటాడా! ఉంటే డబ్బిస్తాడా! ఇచ్చినా, అది తనకి వేళకి అందుతుందా అందినా భార్య కంట పడకుండా ఉంటుందా! కొడుకుకి కష్టం ఆదుకుని శంకరంగారు ఆదర్శపితగా నిరూపించుకుంటాడా గుమ్మంలోకి బండి వచ్చేసింది. సామాను పెట్టేస్తున్నారు. టైము చూసుకుని శంకరంగారి భార్య ఆయన పంచె చొక్కా కండువా ఇచ్చేసి కట్టుకోమంది. శంకరంగారు కదల్లేదు. తను లోపలికి వెళ్తే ఈలోగా కొంప మునుగుతుందని భయం. భార్య గదమాయిస్తోంది.

''మెడ బెణికింది. అర్జెంటుగా కాసిని నీళ్ళు కాచు. కాపడం పెట్టాలి.'' అన్నాడాయన హఠాత్తుగా బాధపడుతూ.

ఆవిడకి జాలేసింది. ''పొద్దుట్నుంచి ఒక్కరూ ఆ పడక కుర్చీలోనే కూర్చున్నారాయె, బెణకుదూ మరి'' అంటూ లోపలికి వెళ్తే కుంపటి రాజేసింది.

ఈలోగా నాగన్న సుబ్బారావింటికి వెళ్ళాడు. సందేశం అందజేశాడు. కాషి

ఆదిభట్ల నిధి

హరికథా పితామహునిగా ప్రసిద్ధి కెక్కిన ఆదిభట్ల నారాయణదాసుగారు 'గోరక్షణ నిధి' పేరిట కొంత డబ్బును ప్రజల నుండి సేకరించారు. ఒకసారి నారాయణదాసుగారు హరికథ చెపుతూ వుండగా ఒక శ్రోత దిగ్గున లేచి ''మీరు గోరక్షణ నిధి పేరుతో బోలెడు డబ్బు వసూలు చేశారు. ఆ డబ్బు అంతా మీరే కైంకర్యం చేశారు. గోరక్షణ ఎక్కడ చేశారు'' అని నిలదీశాడు రోషపడుతూ. అందుకు దాసుగారు నవ్వి ''వెర్రి నాయనా! నేనూ గోవులాంటి వాడినే. అందుచేత ఆ ద్రవ్యంతో నన్ను నేను రక్షించుకున్నాను. ఇది గోరక్షణే కదా!'' అని చెప్పి, తిరిగి కథ క్రమాన్ని సాగించారు. ప్రేక్షకులంతా గొల్లున నవ్వారు. ప్రశ్నించిన వ్యక్తి బిక్కచచ్చిపోయాడు.



యర్ గారికి అప్పిచ్చినా పువ్వుల్లో పెట్టి మళ్ళీ ఇవ్వగలరన్న ధీమాతో సుబ్బారావు గారు ఏభై రూపాయలూ నాగన్నకిచ్చి పంపాడు. నాగన్న వాయువేగ మనోవేగాలతో వచ్చి, శంకరంగారికి రొఖం అందించాడు. 'నా కిస్తానన్న రూపా యేది బాబు'' అన్నాడు.

''రేపు రేపు రేపు. లేదు లేదు చిల్లర లేదు. రేపు రెండు. రేపు రెండిస్తా. పద పద పద'' అంటూ శంకరంగారు ఆదరాబాదరా ఆ డబ్బూ పంచె, చొక్కా పట్టుకుని పడమటింట్లో కెళ్ళిపోయి తలుపేసుకున్నాడు.

***

రైలొచ్చింది. నలుగురూ ఎక్కి కూర్చున్నారు. అక్కడ కూడా శంకరంగారికి స్వేచ్ఛ లేకపోయింది. భార్య ఒక పక్క కోడలికి నీతులు నూరిపోస్తూనే తనని ఓ కంట కనిపెడుతోంది.

''అత్తయ్యా! మా అమ్మలేని కొరత తీర్చారు మీరు ఈ ఒక్క రోజులోనూ. మా పిన్ని ఇంత ఆప్యాయంగా నన్నెన్నడూ చూడలేదత్తయ్యా. మీరు మా వూరు రావాలి. నెల్నాళ్లపాటు ఉండాలి'' అంది కోడలు హఠాత్తుగా.

శంకరంగారి భార్య ఉక్కిరి బిక్కిరై పోయింది. కోడలి శిర్సాన్ని ఆఘ్రాణించింది. మెటికలు విరుచుకు ''నా తల్లే'' అంది ఉప్పొంగే ప్రేమతో. ఒక్క క్షణం ఆగి ''ఏవండీ! కోడలుకి పువ్వులు కొనిద్దామనేనా లేదు గదా. వేళైనట్లుంది. చట్టుక్కున వెళ్ళి కాస్త దవనం మరువం నాలుగు చేమంతి పువ్వులూ పట్రండి.'' అంటూ ఓ పావలా తీసి ఇచ్చింది.

శంకరంగారు ఎగిరి గంతేశాడు.

'నువ్వు కూడా వెళ్ళరా. ఆయన బేరం చేస్తే వాడిన పువ్వులే వచ్చేది.'' అందా విడ.

''దారా నాన్నా'' అన్నాడు శంకరం విడుదల అయిన ఖైదీలా.

పువ్వులు కొన్నాక, అంగీ జేబులో నుంచి ఏభై రూపాయలూ తీసి కొడుకు జేబులో పెట్టాడు. ''భద్రం నాయనా, కోడలికి చెప్పకు. అవసరానికుంచుకో. ఇంతకన్న ఏం చేయలేకపోయాను. తాహీగా పంపుతానులే''.

అనేసి కొడుకు జవాబు వినకుండానే రెక్క పట్టుకుని రైలు పెట్టె దగ్గరికి ఈడ్చు కొచ్చేశాడు.

రైలు కదిలింది.

రతీమన్మధులు చెన్న పట్నానికి, పార్వతీ పరమేశ్వరులు స్వగృహానికి బయల్దేరారు.

ఒంటెద్దు బండిలో జేరగిలబడి కూర్చుని ''అబ్బాయి మొహం అణా యిడ్డైనంతయింది. బయల్దేరినపుడు వెనక నించి డబ్బు పంపుతానన్నారు కాబోలు. అవేం వల్ల కాదు'' అందావిడ హేళనగా.

శంకరంగారు ధీమాగా నవ్వాడు. ''కోడలు పిల్ల మొహం కలకలలాడుతూ, కనబడింది. ఏమిటి సంగతి తెగించి ఓ పావలా చేతులో పెట్టి గుప్పిట మూసి, జంతికలు కొనుక్కోమన్నావా'' అన్నాడు.

''పిల్లలు అవస్థ పడతారని నాకూ తెలుసు. అక్కడికి మీకే ప్రేమ ఉన్నట్టు నిన్నా ఇవాళా నా ప్రాణం తీశారు కాని, పావలా ఏం కర్మం, నిన్న మీరడిగిన యాభై రూపాయలూ, మిమ్మల్ని పువ్వులికి పంపినపుడు పిల్ల చేతిలో పెట్టి గుట్టుగా దాచుకోమని చెప్పాను. అబ్బాయికి ఈ సంగతి రాయబోకండి. రేపే తగలేస్తాడు'' అందావిడ విలాసంగా.

''అబ్బే, నేను రాసినా వాడలా అడగడులే.'' అన్నాడు శంకరం గారు గుంభనగా.



భోగ రాజీయం

జాతీయ వాది, దేశ భక్తుడు అయిన డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య గారిని ఒకసారి బందరులో ఘనంగా సన్మానించారు. ఆనాటి సభకు వక్తగా విచ్చేసిన శ్రీ పి.సి. భట్, పట్టాభిని గురించి ఆవేశంగా మాట్లాడుతూ- ''భోగాన్ని అనుభవించడంలో ఆయన భోగరాజు. దానం చేయడంలో దాన రాజు, యాగశీలత గల త్యాగరాజు..'' అని ఇలా పొగడడం మొదలెట్టారు. పొగడ్తలంటే గిట్టని డాక్టర్ పట్టాభి ఆయన ప్రసంగం అయ్యాక- ''నా గురించి భట్ చెప్పింది ఎంతవరకు నిజమో నాకు తెలియదు కాని భట్ మాత్రం నిజంగా భట్‌రాజే'' అన్నారు. సభ నవ్వులతో నిండగా భట్‌గారు కొంచెం సిగ్గుపడ్డారు.

అరసున్నా కావళ్ళు

సుప్రసిద్ధ సాహితీవేత్త, వీర గ్రాంధిక భాషావాది అయిన జయంతి రామయ్య పంతులు గారి పరంగా కొన్ని చమత్కార కథలు ప్రచారంలో వున్నాయి. అవన్నీ భాషా విషయంలో అప్పటి వారి మధ్య తలయెత్తిన బేధాభిప్రాయాలను పురస్కరించుకుని వెలువడినవే. వాటిలోని సున్నితమైన హాస్యం, సునిశిత విమర్శ ప్రతిపక్షికి సైతం గిలిగింతలు పెడతాయి. జయంతి రామయ్య పంతులు గారి గ్రాంధికత్వాన్ని విమర్శిస్తూ వినవచ్చిన సంఘటన- ఒక బృహద్గ్రంథాన్ని అచ్చువేస్తున్న సమయంలో సరస్వతీ ముద్రాక్షరశాల వారు రామయ్య పంతులు గారితో ''అయ్యా, మీరు కోరినట్లు రెండు కావళ్ల అరసున్నాలు తెప్పించాం. ఎక్కడెక్కడ వెయ్యమంటారు'' అని అడిగారట.

అందుకు పంతులు గారు, ''నాకు మాత్రం ఏం తెలుస్తుందండీ, ఎక్కడ చోటుంటే అక్కడ వెయ్యండి'' అన్నారట.



(ఈ కథ శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారు కొడవటిగంటి కుటుంబ రావుగారికి చెప్పారట.)